# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు




కరెంట్ కోతలపై బీఆర్ఎస్ ధర్నా 2

సంపుటి : 01 | సంచిక : 333 | వరంగల్ | గురువారం, 15 అక్టోబర్ 2026 | పేజీలు : 02

## పట్టభద్రుల ఎమ్మెల్సీ సమావేశం
# విజయవంతం చేయాలి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి
- టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి



**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయ సమావేశం మడికొండలో సత్యసాయి కన్వెన్షన్ లో నిర్వహించే సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మావిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి తెలిపారు.వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో నిర్వహించనున్న సమన్వయ సమావేశానికి పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాము. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిల తో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, టీపీసీసీ నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొననున్నారు.



## శ్రీ మహాలక్ష్మిదేవి అలంకరణలో చండిక అమ్మవారు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** జనగాం జిల్లా పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నాలుగో రోజు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకరణలో చండి అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం,కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీ ప్రసన్న, ఆలయ అర్చకులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745








# విద్యతోనే వ్యక్తి పురోభివృద్ధి

- **గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం**
- **గోపా రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్**

**పాలకుర్తి వాణి, జనగామ** : సమాజంలో ఏ వృత్తికి చెందిన వారికైనా సమస్యల పరిష్కారానికి, వ్యక్తిగత పురోభివృద్ధికి విద్యే ప్రధానమని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ బండి సాయన్న గౌడ్ అన్నారు. జనగామ కౌండిన్య పరపతి సంఘం ఆధ్వర్యంలో నాగారం మామిడి తోటలో నిర్వహించిన పదో తరగతి గౌడ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కౌండిన్య పరపతి సంఘం అధ్యక్షుడు కుర్రెముల యాదగిరి గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 2025-2026 విద్యా సంవత్సరంలో జనగామ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన గౌడ విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించారని పేర్కొన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించడం ద్వారా తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. పురస్కారాల్లో భాగంగా గిరిగాని సిరిచందనకు ప్రథమ, బాలగోని సంజనకు ద్వితీయ, బబ్బూరు మనోజ్ కుమార్‌కు తృతీయ బహుమతులు అందజేశారు. పూజారి రక్షిత, నాయకపు రక్షిత, రాగిణి, శ్రీలేఖలకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పరపతి సంఘం సభ్యులు టి. శారద, దూడల రమేష్ గౌడ్ , బూడిద సుధాకర్ గౌడ్, బూరుగు శ్రీనివాస్ గౌడ్ లను ఈ సందర్భంగా సన్మానించారు.సంఘం గౌరవాధ్యక్షుడు కన్నా పరశురాములు మాట్లాడుతూ, సంఘం ప్రారంభమైనప్పటి నుంచి అధ్యక్షుడు కుర్రెముల యాదగిరి గౌడ్ నేతృత్వంలో ఆర్థిక అభివృద్ధితో పాటు విజ్ఞాన విహార యాత్రలు నిర్వహిస్తూ సభ్యుల్లో సోదరభావం, ఐక్యతను పెంపొందిస్తున్నారని తెలిపారు.మహిళలు, పిల్లల కోసం ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులను ప్రోత్సహిస్తున్న సంఘం కార్యవర్గాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గునిగంటి వెన్నెల రామకృష్ణ గౌడ్, సంఘం కార్యవర్గ సభ్యులు అంబటి రాజయ్య గౌడ్, వి. విజయ కుమార్ గౌడ్, కోశాధికారి దూడల రమేష్ గౌడ్, విశ్రాంత ఆచార్యులు మాచర్ల రాములు గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు భైరగోని శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దూడల రాజసంపత్ గౌడ్, రెడ్‌క్రాస్ సభ్యుడు మేకపోతుల ఆంజనేయులు గౌడ్, మాచర్ల ప్రభాకర్ గౌడ్, టి. రామచంద్రం గౌడ్, విద్యాసాగర్ గౌడ్, కుర్రెముల మాధవి గౌడ్, దూడల శోభారాణి గౌడ్, గూడ రాజబోసు గౌడ్, కన్నా శ్రీనివాస్ గౌడ్, టి. లక్ష్మయ్య గౌడ్, మడిపెల్లి ఐలయ్య గౌడ్, భారతమ్మ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలపై బీఆర్ఎస్ ధర్నా

**పాలకుర్తి వాణి, పెద్దవంగర** : వ్యవసాయానికి నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం వడ్డేకొత్తపల్లి గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం 5 నుంచి 6 గంటల పాటు కూడా సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని విమర్శించారు. విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సరైన సమయంలో నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, పొలాల్లో భూమి బీటలు వారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, సీనియర్ నాయకులు రామచంద్రయ్య శర్మ, సుధీర్, సంజయ్, భాస్కర్, సుధాకర్, వెంకన్న, పటేల్ నాయక్, కవిత యాకన్న, రాము, వెంకట్‌రెడ్డి, శంకర్, యాకన్న, రవి, సమ్మయ్య, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ ఆడుతున్న మహిళలు

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** తెలంగాణ సాంస్కృతిక వైభవానికి, అరుదైన ఆచారాలకు ప్రతీకగా నిలిచే అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలలో భాగంగా పాలకుర్తి గ్రామ పంచాయితీ వద్ద మహిళలు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.



## బీజేపీ ఎండోమెంట్ సెల్ ధార్మిక విభాగంలో కేరళ కరుణాకర్





పాలకుర్తి వాణి, పాలకుర్తి : జనగామ జిల్లా పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా నియామకం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ (ధార్మిక) విభాగంలో కేరళ కరుణాకర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ఎండోమెంట్ సెల్ కన్వీనర్ అన్నభోజుల సూర్యప్రకాశ్, కోకన్వీనర్ నిరంజన్ దేశాయ్,జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్. ఎండోమెంట్ సెల్ జనగామ జిల్లా కన్వీనర్ ఈర్ల రాజు పాలకుర్తి మండలం అధ్యక్షుడు మారం రవి కుమార్ నియామక పత్రాన్ని జారీ చేశారు. ఈ నియామక పత్రం ప్రకారం జనగామ జిల్లా పరిధిలోని పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ధార్మిక విభాగం బాధ్యతలను కేరళ కరుణాకర్‌కు అప్పగించారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణ, దేవాలయాల అభివృద్ధి, ఆలయాల పరిరక్షణ, హిందూ సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడేందుకు కృషి చేయాలని సూచించారు.పాలకుర్తి నియోజకవర్గంలో ధార్మిక కార్యక్రమాల అభివృద్ధికి కృషి చేస్తూ, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని కేరళ కరుణాకర్ ఆశాభావం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341